అభివృద్ధి పథంలో వైకుంఠపురం

- ప్రభుత్వ సాయం రూ. 20.73 కోట్లు
- రూ. 1.81 కోట్లతో అభివృద్ధి పనులు



వైఎస్సార్ హెల్త్‌క్లినిక్

పెనమలూరు: వైకుంఠపురం ప్రాంత పేద ప్రజలను జగనన్న నవరత్నాలు ఆదుకున్నాయి. గోసాల గ్రామ పంచాయతీ శివారు వైకుంఠపురం నిరుపేదలు నివశిస్తున్న ప్రాంతం. ఎన్నో దశాబ్దాలుగా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడి ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం అమలు చేయలేదు. రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో ఉన్న ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో నవరత్నాలు వెలుగును నింపాయి. అలాగే అభివృద్ధి అంటే తెలియని వైకుంఠపురం ప్రాంత ప్రజలకు నేడు రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. వంద శాతం సచివాలయ సేవలు అమలు జరుగుతున్నాయి.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ పథకాలు..

వైకుంఠపురంలో నివశిస్తున్న పేద ప్రజల దశను జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మార్చాయి. ప్రత్యక్ష నగదు బదిలీ పథకం కింద రూ. 13,18,21,750 లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేసింది. పరోక్ష ప్రయోజనాల కింద రూ. 7,55,41,789 కలిపి మొత్తం ఐదేళ్లలో రూ. 20,73,63,539 ప్రభుత్వం పేదల భవిష్యత్తుకు వెచ్చించింది. తమ జీవితాల్లో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి వెలుగునింపిందని స్థానిక ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారు.



వైకుంఠపురంలో అభివృద్ధి పనులు..

వైకుంఠపురం అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం నయా పైసా వెచ్చించలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధితో ఈ ప్రాంతం రూపురేఖలు మారాయి. చాలా కాలంగా స్థానికులు ఎదురు చూసిన సిమెంట్ రోడ్డు రూ. 10 లక్షలతో నిర్మాణం చేశారు. నాడు-నేడు కింద రూ. 20 లక్షలతో పాఠశాల భవనం ఆధునీకరించారు. రూ. 5 లక్షలతో మెటల్‌రోడ్డు నిర్మాణం, వేణుగోపాలస్వామి నగర్‌లో రూ. 15 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రూ. 60 లక్షలతో సంతపాకల నుంచి పుట్టరోడ్డు వరకు సిమెంట్‌రోడ్డు, రూ. 45 లక్షలతో సచివాలయ భవన నిర్మాణం , రూ. 23 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 3 లక్షలతో బోరు నిర్మాణం చేశారు. రూ. 45 లక్షలతో అన్ని వసతులతో సచివాలయ భవనం నిర్మించారు. కొత్తగా ఇస్లాంపేట, నెహ్రూనగర్‌లో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టారు.



సచివాలయ భవనం



వైకుంఠపురంలో సీసీ రోడ్డు

పథకం పేరు	లబ్ధిదారులు	రూ. అందిన మొత్తం
జగనన్న అమ్మ ఒడి	368	రూ.1.64 కోట్లు
జగనన్న విద్యాదీవెన	182	రూ. 63.09 లక్షలు
జగనన్న వసతిదీవెన	144	రూ. 25 లక్షలు
వైఎస్సార్ రైతుభరోసా	79	రూ. 28.10 లక్షలు
ఉచిత పంటలబీమా	24	రూ. 27.09 లక్షలు
సున్నావడ్డీ పంటరుణాలు	12	రూ. 22 వేలు
ఇన్‌పుట్ సబ్సిడీ	20	రూ. 1.67 లక్షలు
మత్స్యకార భరోసా	2	రూ. 20 వేలు
వైఎస్సార్ పింఛన్	470	రూ. 4.47 కోట్లు
వైఎస్సార్ చేయూత	246	రూ. 1.06 కోట్లు
వైఎస్సార్ ఆసరా	514	రూ. 1.72 కోట్లు
వైఎస్సార్ సున్నావడీ	603	రూ. 12.46 లక్షలు
వైఎస్సార్ కాపునేస్తం	53	రూ. 24.30 లక్షలు
వైఎస్సార్ ఈబీసీనేస్తం	6	రూ. 1.80 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	149	రూ. 56.54 లక్షలు
ఆరోగ్య ఆసరా	101	రూ. 7.31 లక్షలు
హౌసింగ్	111	రూ. 1.26 కోట్లు
వైఎస్సార్ బీమా	11	రూ. 26 లక్షలు
వైఎస్సార్ వాహనమిత్ర	42	రూ. 11.40 లక్షలు
జగనన్న చేదోడు	32	రూ. 7.40 లక్షలు
కోవిడ్ సాయం	855	రూ. 8.55 లక్షలు
జగనన్న తోడు	51	రూ. 26 వేలు
ప్రత్యక్ష నగదు బదిలీ	మొత్తం	రూ. 13.18 కోట్లు
పరోక్ష ప్రయోజనాలు..		
ఇంటి స్థలాలు	176	రూ. 4.32 కోట్లు
జగనన్న విద్యా కానుక	214	రూ. 15.19 లక్షలు
ట్యాబ్‌లు	29	రూ. 3.83 లక్షలు
జగనన్న తోడు	71	రూ. 13.21 లక్షలు
జగనన్న గోరుముద్ద	212	రూ. 21 లక్షలు
సంపూర్ణ పోషణ	341	రూ. 63.86 లక్షలు
ఇంటింటి రేషన్	940	రూ. 2.05 కోట్లు
మొత్తం		రూ. 7.55 కోట్లు

జగనన్న పాలనలో ఇంటి స్థలం వచ్చింది



చాలా కాలంగా ఇంటి స్థలం కోసం ఎదురు చూశాం. ఏ ప్రభుత్వం ఇవ్వలేదు. జగనన్న వచ్చిన తర్వాత ఇంటి స్థలం, అమ్మ ఒడి పథకం ద్వారా న్యాయం జరిగింది. గూడులేని మాకు గూడు ఏర్పడింది.

షేక్.సిలార్‌బి, వైకుంఠపురం

ఆర్థిక ఇబ్బందులు తొలగాయి



జగనన్న పాలనలో ఆర్థిక ఇబ్బందులు తొలగాయి. ఆసరా, అమ్మ ఒడి ద్వారా రూ. 53 వేలు సాయం నేరుగా అందింది. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లతో పథకాలు అవినీతి లేకుండా అందాయి.

ఎస్.లక్ష్మిరాజ్యం, వైకుంఠపురం

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరాయి



జగనన్న గత ఎన్నికల్లో పేద ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చారు. వైకుంఠపురం పేదల జీవితాల్లో వెలుగు నింపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేశాం. ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటాం.

సంగెపు శ్రీనివాసరావు, సర్పంచి, గోసాల

క్లుప్తంగా

పేరంటాలమ్మ ఆలయంలో రేపు చండీహోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 8వ తేదీన అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ శనివారం తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 9న తెలుగు సంవత్సర ఉగాది సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈనెల 13న క్రోధి నామ సంవత్సర చైత్రశుద్ధ పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన అష్టోత్తర శతకలశార్చన అభిషేకం, శ్రీ మహాలక్ష్మి యాగం జరుగుతుందన్నారు.

కూరగాయల బండి అందజేత



పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామానికి చెందిన కలపాల అబ్రహాం ఆర్థిక సహాయంతో కూరగాయల వ్యాపారం చేసుకునేందుకు మొబైల్ బండిని పేద ముస్లిం కుటుంబానికి చెందిన షేక్ ఫర్జానాకు శనివారం అందజేశారు. కె.సందీప్‌కుమార్, ఎన్.చిన్న బాబు, కె.భాస్కర్‌రావు, జె.గాంధీ, ఎన్.కోటేశ్వరరావు,జె.కృష్ణ, కె.సురేష్ పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్లకు శిక్షణ



పెనమలూరు: పెనమలూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శనివారం సెక్టార్ ఆఫీసర్లకు ఈవీఎంలపై శిక్షణ ఇచ్చారు. తొలుత ఈ శిక్షణ కార్యక్రమాన్ని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 24 మంది సెక్టార్ అధికారులు ఉన్నారన్నారు. హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ సెక్టార్ ఆఫీసర్స్ కార్యక్రమంలో భాగంగా ఈవీఎం పరికరాన్ని ఎలా ఉపయోగించాలనే విషయమై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్‌బాబు, సెక్టార్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల విస్తృత ప్రచారం



ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో జరిగిన సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుపై వేయాలని అభ్యర్థించారు. మానికొండలో జరిగిన ప్రచారంలో గన్నవరం జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, శ్రీమణిమ్మ, వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, తేలప్రోలులో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరవల్లిలో చలివేంద్రం ఏర్పాటు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయని పలువురు కొనియాడారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని తిరుపతమ్మ తల్లి దేవస్థానం సెంటర్‌లో మమతల పందిరి ఫేస్‌బుక్ గ్రూప్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. వేసవి పూర్తయ్యే వరకు ఈ కేంద్రాన్ని నిర్వహిస్తామని ఫేస్‌బుక్ గ్రూప్ అడ్మిన్ లంక రమేష్ తెలిపారు.ఈ చలివేంద్రంలో కూలింగ్ మినరల్ వాటర్‌ను పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రూప్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రముఖులు గుండపనేని ఉమావరప్రసాద్, కోడెబోయిన బాబి, కలపాల నాని, రాజాబాబు, కాకరాల శ్రీధర్, మోర్ల అంజిబాబు, రాయి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మత సామరస్యం అందరి అభిమతం కావాలి

గన్నవరంరూరల్: మత సామరస్యం విద్యార్థుల అభిమతం కావాలని ముస్తాబాద నవభారత్ హైస్కూల్ ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా అన్నారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం రాత్రి విద్యార్థులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం విశిష్టతను వివరిస్తూ భారతదేశం లౌకిక రాజ్యమని పేర్కొన్నారు. పరమత సహనం అందరూ కలిగి ఉండాలన్నారు. సెమీ క్రిస్మస్, సంక్రాంతి సంబరాలు, రంజాన్ ఫెస్ట్ విద్యార్థులలో స్నేహతత్వాన్ని, సోదర భావాన్ని పెంచుతాయన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఇఫ్తార్ విందు ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ షేక్ ఇమాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



పార్టీలో చేరిన నాయకులతో మంత్రి జోగి రమేష్

పెనమలూరు: వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నేతలు చేరారు. యనమలకుదురు గ్రామం ఇందిరానగర్ 1, 2కు చెందిన షేక్.ఇమ్రాన్ ఆధ్వర్యంలో 50 మంది టీడీపీ, జనసేన నాయకులు శనివారం గంగూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి మంత్రి జోగి రమేష్ సాదరంగా ఆహ్వానించారు.

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలయికని ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు విభేదిస్తున్నారన్నారు. జగనన్న పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా సరఫరా



ప్రొద్దుటూరులో విద్యుత్ పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న ఏడీఈ పూర్ణచంద్రరావు

కంకిపాడు: నాణ్యమైన విద్యుత్‌ను నిరాటంకంగా సరఫరా చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఎం.పూర్ణచంద్రరావు తెలిపారు. కంకిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రొద్దుటూరు 33/11 కెవి, ఈడుపుగల్లు, ఉప్పలూరు, మారేడుమాక విద్యుత్ ఉప కేంద్రాలను విద్యుత్‌శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఆయా సబ్‌స్టేషన్లలో రికార్డులను తనిఖీ చేసి, విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏడీఈ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఎంతో సమర్థంగా విద్యుత్ పంపిణీ జరుగుతుందన్నారు. గతేడాది ఏప్రిల్ 5వ తేదీ నాటికి 0.84 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం జరగ్గా, ఈ ఏడాది ఏప్రిల్ 5వ తేదీకి 1.11 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం జరిగిందన్నారు. గతంతో పోలిస్తే 30 శాతం విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నూతనంగా మారేడుమాక విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి తేవటం, లూజు విద్యుత్ లైన్లను సరిచేయటం ద్వారా విద్యుత్ ఎంతో సమర్థంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో శివారు ప్రాంతానికి సైతం నూతన విద్యుత్ లైన్లు, స్తంభాలను ఏర్పాటు చేయటం ద్వారా నాణ్యమైన విద్యుత్ సేవలు అందుబాటులోకి తీసుకెళ్లామన్నారు. తనిఖీల్లో ఏఈ టి.అశోక్ కుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాడు కథనం అవాస్తవం

ప్రొద్దుటూరు, మదూరు తదితర విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారంటూ ఈనాడులో శనివారం ప్రచురితమైన కథనం పూర్తిగా అవాస్తవమని విద్యుత్ శాఖ ఏడీఈ పూర్ణచంద్రరావు అన్నారు. కంకిపాడు మండలం వ్యాప్తంగా ఏ ఒక్క గ్రామంలోనూ విద్యుత్‌కోత విధించలేదన్నారు. కథనం పూర్తిగా వాస్తవ విరుద్ధమని పేర్కొన్నారు.

యార్లగడ్డవి ఉత్తర కుమార ప్రగల్భాలు



మాట్లాడుతున్న తోట, ఇతర నాయకులు

గన్నవరం: రానున్న ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య స్పష్టం చేశారు. ఓటమిని ముందే గ్రహించిన టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతూ ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు కందిమళ్ల శ్రీనివాసరావు, రాయల జగదీష్‌బాబు, పీఏసీఎస్ అధ్యక్షులు తుల్లిమిల్లి ఏడుకొండలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 18 ఏళ్లుగా వంశీమోహన్ నియోజకవర్గ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు ద్వారా చేరువయ్యారని తెలిపారు.పోలవరం కాలువపై సొంత ఖర్చుతో మోటర్లు ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించారని గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలకు వంశీమోహన్ అండగా నిలిచారని చెప్పారు. కేవలం ఎన్నికల ముందు వచ్చి, తర్వాత అమెరికా వెళ్లిపోయే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అటువంటి వ్యక్తి సూరంపల్లి పర్యటనకు వచ్చి వైఎస్సార్ సీపీకి డిపాజిట్లు లేకుండా చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రజలకు ఏం చేశారో ప్రచారం చేసుకోవాలని సూచించారు. పార్టీ ఎన్నికల పర్యవేక్షకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నీలం ప్రవీణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్ పాల్గొన్నారు.

సాగు, తాగునీరు లేకుండా చేస్తా: యార్లగడ్డ

గన్నవరం: టీడీపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోని మెట్ట ప్రాంతంలో ప్రధాన సాగునీటి వనరైన బ్రహ్మయ్య లింగయ్య చెరువులో సాగు, తాగునీరు లేకుండా చేస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంది. ఇటీవల ఎన్నికల సన్నాహక సమావేశాల్లో యార్లగడ్డ చేసిన ఈ వ్యాఖ్యలు పట్ల ప్రజలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. యార్లగడ్డ మాటల నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజలు గత టీడీపీ పాలనకు సంబంధించిన దుర్భిష పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. గతంలో 1994 నుండి 2004 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వర్షభావ పరిస్థితులు కారణంగా బ్రహ్మయ్య లింగయ్య చెరువులో నీరు లేక పంటలు ఎండిపోయాయి. ఆ సమయంలో మెట్ట ప్రాంత రైతులు తీవ్ర కరువును ఎదుర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు కూడా పెద్దగా వర్షాలు లేక ఈ చెరువులో నీరు లేని పరిస్థితి. గత అనుభవాలు దృష్ట్యా టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తే సాగు, తాగునీరు లేకుండా చేస్తానని యార్లగడ్డ వ్యాఖ్యలు చేసినట్లుగా ఉందని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: గంగూరు గ్రామంలో ఆటో డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు ఉర్దూ స్కూల్ ప్రాంతానికి చెందిన నందిపాముల సురేష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన కోటమ్మ ఫోన్ చేసి ఆటో కిరాయికి రావాలని కోరింది. దీంతో సురేష్ ఆటోతో కోటమ్మ ఇంటికి వెళ్లాడు. అయితే అక్కడ కుమారి, కోటమ్మ, సతీష్ పలువురు వ్యక్తులు ఉన్నారు. ఆటో డ్రైవర్ సురేష్ వద్దకు వెళ్లి సతీష్, కోటమ్మలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుమారి పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నావు ఏమిటని అతనిపై దాడి చేశారు. దీంతో సురేష్ తలకు గాయమైంది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సతీష్, కోటమ్మలపైపోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన వెలిశల కీర్తికుమారి 2014వ సంవత్సరంలో విజయవాడ చిట్టినగర్‌కు చెందిన సంజయ్‌కుమార్‌ను కట్న కానుకలు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి పాప పుట్టింది. అయితే పెళ్లి సమయంలో భర్త ప్రభుత్వ ఉద్యోగం అని చెప్పగా అతనికి ఎటువంటి ఉద్యోగం లేదు. పైగా ఆడపిల్ల పుట్టిందని, ఇచ్చిన కట్నం చాలదని, అదనపు కట్నం తీసుకరమ్మని భర్తతో పాటు మామ విజయ్‌కుమార్, అత్త వెరినీకమ్మ, ఆడపడుచు ప్రశాంతి, ఆమె భర్త అజయ్‌కుమార్ వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని తెన్నేరు గ్రామ శివారు ఖాళీ పొలాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7020 నగదు స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ముమ్మరంగా కొనసాగుతున్న ఉపాధి పనులు



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ సత్యప్రియ

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 21 గ్రామాల్లో సగటున రోజుకు 3,400 మంది కూలీలు పనులు చేస్తున్నారు. తాత్కాలిక టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, మంచినీరు సిద్ధంగా ఉంచుతున్నారు. వేసవి కాలం కావటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో నిరంతరం స్థానిక అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఆదేశాలిస్తూ పనుల ప్రదేశంలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ కూలీలు పనుల్లో పాల్గొనాలని సూచిస్తున్నారు. గతంలో రోజుకు కూలీ రూ.272గా ఉండేది. ప్రస్తుతం రూ.300లకు పెంచారు. నిర్ణీత కొలతలతో పనులు చూపించగా కూలీలు పనులు చేస్తున్నారు. మండలంలో 18 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు సేవలందిస్తున్నారని ఏపీఓ సత్యప్రియ తెలిపారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న గొడవర్రు గ్రామ వలంటీర్లు

కంకిపాడు: గొడవర్రు గ్రామానికి చెందిన వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రాజీనామా ప్రతులపై సంతకాలు చేసి ఎంపీడీఓ పి.అనూషకు 16 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో స్వచ్ఛంద సేవ చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి కూటమి నేతలు తమను టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తూ మనోభావాలను దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఆత్మాభిమానం గలవారుగా తామంతా రాజీనామా చేస్తున్నామని పేర్కొన్నారు. వలంటీర్లకు గ్రామ సర్పంచ్ మేరుగు విజయ్‌కుమార్, నాయకులు కాగిత రాజా రమేష్, ఇంటూరి రామయ్య, చుండూరు మోహన్‌రావు, ఎం.కృష్ణ, వక్కలగడ్డ రాము, వేల్పూరు నేతలు చెన్నుబోయిన సుబ్బారావు, కొఠారి సాంబశివరావు మద్దతు తెలిపారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఎన్నికల్లో గెలుపొందడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. అందుకే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గొల్లపూడిలో నలుగురు, రామవరప్పాడు, నిడమానూరులో ఇద్దరేసి చొప్పున, అంబాపురం, జక్కంపూడి, ప్రసాదంపాడు, పి.నైనవరం గ్రామాల్లో ఒక్కొక్కరు రాజీనామా చేశారు.

గన్నవరంరూరల్: ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గెలుపు కోసం మేము సైతం సిద్ధం అంటూ గొల్లనపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లు అజయ్, శేషు శనివారం రాజీనామాలు కార్యదర్శి మారుతీ ప్రసాద్‌కు స్థానిక సచివాలయంలో అందజేశారు.

బాల్కనీ నుంచి పడి వృద్ధుడికి గాయాలు

పెనమలూరు: పోరంకిలో వృద్ధుడు బాల్కనీలో నుంచి కిందపడి గాయపడటంతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం జి.రమేష్ కుటుంబ సభ్యులతో పోరంకిలో నివశిస్తున్నాడు. కాగా అతని తండ్రి నరసింహారావు కూడా కుమారుడు రమేష్‌తోనే ఉంటున్నాడు. అయితే తండ్రి నరసింహారావు బాలకనీ గోడపై టవల్ ఆరవేస్తూ తూలు వచ్చి బాల్కనీ నుంచి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతని తలకు గాయమైంది. గాయపడిన నరసింహారావును పోరంకిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రశీదు పుస్తకం పోయినది

పెదపులిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నెం. H-750 వారు కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్, పటమట బ్రాంచి ద్వారా సంఘం సందలి రైతుల నుండి ఋణములు వసూలు నిమిత్తం రశీదు పుస్తకం ది. 7-3-2024న కొనుగోలు చేసినాము. ఆ పుస్తకము ది. 6-4-2024 శనివారం పెదపులిపాక నుండి పటమట కె.డి.సి.సి. బ్యాంక్‌కు వెళ్ళు మార్గ మధ్యలో (తాడిగడప టు యనమలకుదురు డొంక రోడ్డు) బ్యాగ్ నుండి జారిపోయినది. రశీదు నెం. 5947151 నుండి 5947171 వరకు రైతుల నుండి వసూలు చేసిన ఋణముల తాలూకు రశీదులు. నెం. 5947172 నుండి 5947200 వరకు ఖాళీ రశీదులుగా ధృవపరచబడినది. కావున దొరికిన వారు అందజేయగలరు.

బి. రఘు, CEO, పెదపులిపాక PACS సెల్: 72071 25677

నేడు చంద్రబాబు కృష్ణాజిల్లా పర్యటన

పామర్రు: ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో పామర్రు, ఉయ్యూరులలో నిర్వహించే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారని ఆ పార్టీ స్థానిక నాయకులు వెల్లడించారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా ఉదయం శనీశ్వర స్వామివారికి విశేష తైలాభిషేకం చేశారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శ్రీనందీశ్వరస్వామివారికి ప్రదోష సమయంలో అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ప్రధాన పూజారి జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.